# రాయబారాలు

రచన :
"వెంచాశా"

*

"ఏ విషయంలో జోక్యం కలుగజేసుకోవడం చాలా అనవసరం... నే చేసేపని నాకు నచ్చినట్టే గా—"

ఆ విధంగా పెరిగిపోయేటప్పటికి నేను బయటికి రావలసివచ్చింది. తలుపు ఫెఠేలుమన్నది. ఛీ ఇంతకన్నా పరమఛండాలుడు ఇంకోడున్నాడా అనుకున్నాను.

రూములోవచ్చి కూచున్నాన నేమాటే గాని నిమితంఏదీ...ఒక్కముక్క...చదువుతున్నపుస్తకం మూసేసి...బయటకువచ్చాను...

"నిన్నట్లా చిత్రవధ చేయాల్సిందే...రాకాసీ! ...లేకపోతేమాట వింటావా..."

చాలాకఅకుగా మాట్లాడుతున్నాడు, దెబ్బలు వినబడుతున్నాయి...ఆమెకున్న సహనం, ఓర్పు ఎదటనిల్చిని ఎదుర్కొన్నట్లుగా వుంది. మరి చడీచప్పుడులేదు ...

"ఇప్పుడు మీనాన్న దిగివస్తాడే మో చూస్తా"...

ఊహుఁ అప్పటికీ నిశ్శబ్దం...దెబ్బలుమాత్రం వినబడుతున్నాయి...

ఏమీతోచలేదు...దగ్గరకివెళ్ళి తలుపుతట్టాను.

"ఎవరువారు...ఇప్పుడే తలుపుతియ్యరు!"

'పోస్టుమేన్ సర్!'—గొంతుమార్చాను.

ముఖాముఖీ ఎదటనిల్చుని—

"నీ మతి ఇక్కడవుందా...చేస్తున్న పనేవిటి ...నీకుచెయ్యన్నా చెప్పి అనిపించలేదూ—..." కొంచెం కసిరినట్టు మాట్లాడేటప్పటికి...

"జగ్గరాజుగారూ...ఈ విషయంలోమాత్రం ..." కొంచెం దగ్గరికివచ్చి సీదాగా ఆరంభించాడు.

ఒళ్ళుతెలీక కిందపడివున్న ఆమెమీదకు వుఠికి ఇంకొకదెబ్బ—

అది నామీదకు రావటం జరిగింది...

"జగ్గరాజుగారూ.....మళ్ళీ చెప్తున్నాను, మీరుమటుకు ఈ విషయం.. లో"

—అఘ్ఘోరించినట్లుంది...అని గుండెలదాకా చేయిపోనిచ్చి... ధడక్ ...ధడక్ ... మంటుంటే చొక్కాపట్టుకుని బయటకు లాక్కువచ్చాను.

భుజంమీద పొడిచిన ఒక్క పిడికిలపోటుకే అ...మ్మో...అనుకుంటూ నీరసించి...నాలుగడుగులు పక్కకు తిరిగి...తాగినవాడి మాదిరి తూలుతూ... ఇంట్లో జొరబడ్డాడు. ముఖం అటువైపు తిప్పుకుని చెమట కార్తున్న కనుబొమలు ముడిచి మంచంమీద బరువుగా వాలాడు—

చీమచిటుక్కుమన్లేదు :

ఇంత బలహీనుడేం ?

చుట్టుపక్కలవాళ్లు అటువైపువచ్చి కన్నెత్తి చూడలేదు...ఆ...మనకెందుకు కోతిపుండు బ్ర... హ్మరాక్షసి, గప్...చిఫ్...!

నిద్రపోతున్న ఆమె కనురెప్పలు మూసివున్న గొంతు చించుకుపోయి—అది నిద్రేనంటావా... స్పృహ లేదు:—

'అమ్మాయీ ?' అని నింపాదిగా పిలిచాను.

జవాబులేదు.

వాడుమాత్రం పెడమొగం పెట్టి—కళ్ళు మూద్దామావద్దా అనే పరిస్థితుల్లో ఉన్నాడు.

కా—స్సేపటికి ఆమె కళ్ళుతెరచి ఒకపొర్లు పొర్లి నరాలన్నీ తీసుకుని లేచికూచింది. తనను బాగా కొట్టాడని తెలుసునా—?—

మనిషి రెల్లుపుడకలాగ మరీ వంగిపోయి నన్ను చూసి సిగ్గునభినయించి—ఇదేవిటి జగ్గరాజుగారు ఇక్కడికి వచ్చారనుకుందేమో—వంటయింటి గుమ్మంలోకి ఒక్కపరుగున వెళ్ళిపోయి—ముచ్చెమటలుపోసి కుప్పగా కూలిపోయింది.

దగ్గరికి వెళ్ళనిచ్చిని...పోస్టుమేన్ వలె జరిగిన సంగతి తెలుసుగా...అన్నాను.

మాట్లాడలేక నాలిక పీక్కుపోయి, దాహం అని సూచించేటప్పటికి—

వాడీమాత్రం పెడమొగంపెట్టి...ఆ మంచం మీదనే—గుండె ఆగిపోయినవాడిమాదిరి :

నా యింట్లోకి వెళ్ళి, కూజా, చిన్న గ్లాసూ తెచ్చి ఎదట ఉంచాను. నాకింకా కోపం ఆగక—ముచ్చుమాదిరి ముడుచుకు పడుకుంటే—బహా మూర్...

ఊహుఁ అసలు ముఖం ఇటువైపుతిప్పందే... ఇంకా ఉడుకుతునేవుంది నా రక్తం...

యుద్ధభూమిమాదిరి చిందరవందరగా పడి ఉన్న ఇల్లును కొంచెం ఓపికతోసర్ది...నెమరేస్తున్న ఖారాను మ్రింగకుండా...

అతని మంచం దగ్గరకు వెళ్లి రామలింగం! నేను వెళ్తున్నాను...అని చెప్పి...

'రా...మ్మా...' చేయి ఊతంఇచ్చి నిల్చుండే టట్టు చేసి...తీసుకవెళ్లాను.

ఇద్దరీ ఇళ్లూ ఒకరికొకరు క్రీగంటితో చూసు కుంటయి...

తెల్లవారితేగాని వళ్ళు తేరుకోదు. మరి అంత పశుబలం అయితే ఎట్లా...

హోటలువాడు కారియరుతెచ్చి అక్కడ పెట్టి—అదాబ్! అని...గడపదాటాడు :

ఏమీ పరవాలేదు...భోంచేయి తల్లీ...—ఇదిగో జగ్గరాజు చెప్తున్నాడు తినమని...తినాలి... లేకపోతే బావుండదు...నాకు కొంచెం కోపంవచ్చి నట్టు కసురుకున్నాను.

. అన్నం తినేదాకా అక్కడే కూచుని—తప్పనిసరిగా ఆమెచేత మాట్లాడిద్దామని మా హోటలు భోజనం ఎలావుందీ—బావుంది అనిపించు కుని...

అతనేదో చిన్నవాడు...ఇంకా కుర్రతనం ఆ బిగువు పోలేదు. కానీ...నసపెడ్తూండటం వాస్త వమే—మనం ఎంతో గుంభనగా వుండాలి, చలించ కూడదన్నాను నవ్వులో...—మర్నాడుగూడా రామలింగంలో తేలికదనం కన్పించలేదు.

పోనీ అతనికి తిండివుందా—రాత్రి...నీళ్లు తాగాడా...అనిగానీ అతన్నిగురించిన ప్రశ్నలు నాలో కలగలేదు అదేవిటో.

అదంతా అతనిమీద నాకున్నకోపమా అంటే నేనేం చెప్పలేను: ఆ మర్నాడు చెప్పాను దగ్గర కూచోపెట్టుకుని...నిన్ను పేరుపెట్టి పిలుస్తున్నాను: అమ్మాయీ జానికీ... ఇప్పుడు వెళ్ళి...కూరా... అన్నం వండి, నీళ్ళు కాగబెట్టి...అన్నీ అయిన తరు వాత...కంచములో అన్నంవుంచి...

నీవు స్వయంగావెళ్ళి... ఏవండీ...అని అతని వంటిమీద చేయివేసి...నిద్రలేపు...ఏమన్నా అననీ ...ఏం...వింటున్నావా...

—నేను ఆఫీసుకు వెళ్ళిపోయినాను...కాని రామలింగంమటుకు నామీద కోపంగావున్నట్టు ప్రవర్తి స్తాడు... నేనేంచేశానో.

ఎప్పుడో నాల్గునెల్లనాడు 'భార్య' అనే పదాన్ని అర్థంచేసుకోవాలోయ్...అన్నాను ముక్త సరిగా.

* * *

—క్రిక్కిరిసియున్న రైల్లో... అందులో దక్షిణ హిందూస్థానపు మూడోతరగతి రైలుపెట్టె—గోల్డుఫ్లేకు సిగిరెట్టు పెదిమలకు అంటీ అంటనట్లు... వెలిగించి. కాస్తచోటుకోసం పక్కవాడితో బాతా ఖానీ మొదలుపెట్టాను...

—"ఈ ఏడు పంటలు సరిగాలేవన్నాడు పక్కవాడు" 'రోజులు ముమ్మరంగావున్నయిలే' అని కొంచెం సావకాశంగా కూచున్నాను...

"ఏవండోయ్ జగ్గరాజుగారూ— ఇక్కడున్నారేంటీ" అమాంతంవచ్చి నా బుజం లంకించు కుని ఇహిహీ అని నవ్వాడు. ఓరి సీతస్స—అనుకుని "ఏవిటీ పంతులు విశేషం...కులాసా..." కుశల ప్రశ్నలు వేసిం తరువాత...నాకు నాల్గునెల్లక్రితమే

ట్రాన్సఫరు అయిందని శ్రీకాకుళంలో వుంటున్నానని చెప్పేను. తేగల్లె అంతెత్తు ఎగిరి...'మాతో ఆ మాత్రం...చెప్పకూడదటండీ...' మళ్ళీ ఇహీహీలని పిచ్చినవ్వునవ్వాడు.

'సిగిరెట్టు ముట్టించవోయ్—' పెట్టెముందర వుంచాను.

'వద్దండీ జగ్గరాజుగారూ...''

కాల్చమని కసిరేటప్పటికి నవ్వులో ఒకటి ముట్టించి పొగవదల్తూ...

జగ్గరాజుగారూ దాన్నితీసుకురాను వెళ్తున్నాను. ఉత్తరంరాసింది... వాళ్ళనాన్నకు జబ్బుగా వుందని... ఒంటరిగా రాలేనని''

''—అమ్మాయి కులాసా—''

''కులాసాగానేవుంది...పాపం ఈ మధ్య వాళ్ళ తమ్ముడికి జబ్బుగావుందంటే పంపించాను నెలైంది: తనేవుత్తరం రాసింది రమ్మనమని''— ఇదిగో, ఈ కమలాఫలం వలుస్తాను...ఒకటి నోట్లోవేసుకో...పులుపులేదులే...అని అందించి ఇహకానీయ్...అన్నాను.

''జగ్గరాజుగారూ—...మీరు మాయింటికి రావాలిశలవలకు...అప్పటికి అదివస్తుంది రెండుపూటలుండిపోవాలి...''

''దానికేం లేవోయ్...ఈ పేపరుచూశావ్ గాంధీగారికి కొంచెం అస్వస్థత గావుందట—''

చదువుతున్న పేపరు అతని మొగానికి అడ్డపెట్టి...మరోసిగిరెట్టు వెలిగించాను.

''ఏవిటో చెప్పాననిగాదు తప్పకరావాలి... నాకు పిలవడం అంతకన్న చేతగాదులెండి—'' నా బుజం కదిపి 'ఏవండీ'అని పేపరు మళ్ళీనాకిచ్చేశాడు.

''నీకేమన్నా ప్రమోషను వచ్చిందా రామలింగం—'' అంటే...'నాజీవితంలో ప్రమోషను వచ్చింది' అన్నాడు తమాషాగా...

నా చిరునామా అడిగితే...జాగ్రఫీ మాష్టరు, శ్రీకాకుళం అంటే వస్తుందన్నాను...

రైలు ఆగింది: తను ఆ స్టేషనులోదిగి ప్లాటుఫారంమీద రైలు పోయేదాకావుండి డిశంబరు శలవలకు ఉత్తరంవేస్తానని చెప్పి...వస్తానండీ జగ్గరాజుగారూ...—రైలుకదిలింది...ప్లాటుఫారం వెనక్కిపోతున్నది...

నాపక్కనున్నవాడు—''వేరుశనగ్గథర పడిపోయిందండీ—'' అన్నాడు.

# రచయితలకు మనవి

'కథాంజలి' 7వ వార్షిక సంచిక జూన్ 10వతేదీన వెలువడుతుంది.

ప్రతీ ప్రత్యేక సంచికనూ నూతన అకృతులతో తయారుచెయ్యాలని మా ఆశ. అదే ప్రకారం వెనుకటి సంచికలను మీ సహకారంతో మా యథాశక్తి కృషితో పాఠకులకు అందించాం.

ఈ 7వ వార్షిక సంచికనుకూడా ఒక నూతన పద్ధతిలో అలంకరించాలని తగిన కృషి చేస్తున్నాం,

ఈకృషి సాఫల్యమవడానికి రచయితలు కూడా ప్రత్యేకశ్రద్ధ వహించాలని కోరుతున్నాం. ప్రతీ కథా, వ్యాసమూ, గేయమూ మన నిత్యజీవితంలో జరిగే ఒడుదుడుకులతోను, సంఘ దురాచార నగ్నదృశ్యాలతోను నిష్పక్షపాతమైన విమర్శలతో నిండివుండాలి. ప్రతీ రచనా అచ్చులో రెండు పేజీలకు మించకూడదు.

రచయితలకు ముఖ్యంగా యీ రెండు పేజీల నిబంధన యెందుకు ప్రవేశపెట్టామో అందరికీ తెలిసిన విషయమే. కాగితాల కరువు యెక్కువౌతున్న రోజుల్లో పెద్దపెద్ద రచనలను ప్రకటించడానికి అవకాశం వుండదు. అన్యథా భావించక రచయితలు తమరచనల్ని 10-5-46 లోపల మాకు అందేటట్లు పంపించి మా కృషికి తోడ్పడాలని కోరుతున్నాం. —సం॥